పెద కథ

# అమ్మకానికో అమ్మాయి

రావుబాబు

అయినా మొగవాళ్ళ ప్రేమకి అర్థం వుందా?

ఎమిలీ చెప్పినట్టు అవసరాలు తీరేటందుకు ఆర్భాటాలేగాని నిజమయిన ప్రేమ అంటూ ఈ మొగాళ్ళకు ఛస్తే వుండదు. మొగజాతి వొట్టి తుమ్మెదలజాతి. ఇంతకన్న చక్కటి పుష్పం ఆ వంక కన్పిస్తే, ఇటునుంచి అటు వ్రాలడానికి ఏ ప్రేమసూత్రాలూ వారినడ్డవు. లేకపోతే నిన్న మొన్నటిదాకా నీతోడిదే లోకం, నువ్వే నా ప్రేమ దేవతవు అని దండకాలు చదివిన జార్జికి నేనసలు జ్ఞాపకానికే రావడం మానేశాడే!

ఎవరో వాళ్ళ క్లాసుమేటు పద్మినిట, చాలా తెలివిగలదిట, దాని మాటల్లో ఆనందం వెల్లివిరుస్తుందట- ఏమిటేమిటో చెబుతూవచ్చేడు. మూడువంతులు ప్రస్తుతం ఆ పద్మంతోటే ఈ తుమ్మెద విహరిస్తూ వుండవచ్చు.

ఇంతకూ మా రోజుల మహిమ కాకపోతే నెల తిరిగేసరికి మూడువందల రూపాయిలు జీతం తెచ్చే నాన్న హఠాత్తుగా చనిపోవడమేమిటి? మా నాన్న బతికున్నన్నాళ్ళూ తోకఆడించుకుంటూ తిరిగే స్నేహితులంతా ఆయన పోయినతర్వాత, అదేం ఖర్మమోగాని, మావంక కన్నెత్తిచూడ్డం కూడా మానేశారు. ఉన్న ఒక్క మేనమామ ఎటు పరారీ అయిపోయినాడో జాడలేదు. అటు మాఅక్కయ్య డోరా కూడా అమ్మకిచెప్పకుండా ఎవ్వరితోనూ సంప్రదించకుండా, డేవిడ్‌ని రహస్యంగా పెళ్ళిచేసుకుని లేచిపోయింది. మాఅమ్మకి వళ్ళుమండిందంటే మండదూ? అక్కయ్య చేసిన పని నాకూ నచ్చలేదు. పెళ్ళే పెళ్ళి! పెద్దవాళ్ళ చెవిని కాస్త వెయ్యకుండా అంత స్వతంత్రురాలయితే ఎలా? ఏమయినప్పటికీ ఈ ఇబ్బందులలో ఆ అక్కయ్యదగ్గరికి వెళ్ళడంకాని, వాళ్ళను ఏ సహాయం కోరడంగాని కలలో అయినా జరగదు.

లేమి అంటే ఏమిటో తెలియకుండా పెంచేడు మా నాన్న. ఆయన పోయినదగ్గర్నుంచి నీటిలోంచి తీసిన చేపల్లాగే అయిపోయినాము. ఇంత సంసారం ఒక్క మా అన్నయ్య, జిమ్మీ జీతం మీదే నడవాలాయెను! నూటపదిరూపాయిలు దేనికి చాలతాయని? ఒక్క కాఫీలకే అవుతున్నది బోలెడు. దానికితోడు అమ్మకి జబ్బు. డాక్టరు బిల్లులకీ మందులకీ బోలెడవుతోంది. జిమ్మీమాత్రం ఎంతకని అప్పు తెస్తాడు?

నాకీపాటికి పెళ్ళి అయినా అయివుంటే నా బాధ వీళ్ళకి వదిలివుండును. జార్జి నిజంగా పెళ్ళి చేసుకుంటాడనే నమ్మేను. వొట్టి దగామనిషి. మా బీదస్థితిచూసి కాబోలు మొహంచూపించడమే మానేశాడు... ఎంతయినా లక్షాధికారి కొడుకాయెను. తన తాహతుకి మేము తగుతామగనకనా? ఆ ఆశలన్నీ ఇహ అడియాశలే. మా కుటుంబ భారము అంతా తననెత్తినిపడుతుందన్న భయమే అతనిలోని మార్పుకి కారణమయి వుండవచ్చు. ఏ భయమూ లేకపోతే పట్నంలో చదువుతేనట్టు విశాఖపట్నంలో జాయిను అవడమేమిటి?

ఎక్కడయినా ఉద్యోగం చేద్దామన్నా "కేంబ్రిడ్జి"పూర్తి అయినా చెయ్యలేదు. మా నాన్న పోవడంతో నా చదువు ఆగిపోయింది. పెద్దపెద్ద పరీక్షలన్నీ పేసవాలని కలలు కనేదాన్ని. నాతోపాటు మాచెల్లి మేరీకూడా చదువుకి స్వస్తి చెప్పవలసివచ్చింది. వయస్సుమాత్రం ముదురుతోందిద్దరికీని. నాకున్నాయిప్పుడే ఇరవై ఏళ్ళు. మేరీకి పద్దెనిమిది. ఈ వయస్సులు మోసుకుంటూ ఎన్నాళ్ళని ఇలా జిమ్మీజీతంమీదపడి తింటాము? ఉద్యోగంకోసమే ఎలాగయినా ప్రయత్నించాలి, మరోమార్గంలేదు. నాకు లేకపోయినా మా మేరీ చేతనైనా పెద్దపరీక్షలు పేసుచేయించాలి. దానికి పద్ధెనిమిదేళ్లు వున్నాయన్నమాటేగాని, బొత్తిగా చిన్నపిల్లలా ప్రవర్తిస్తుంది. ఎంతసేపూ వీళ్ళింటికీ వాళ్ళింటికీ తిరగడమేకాని ఏ సంగతీ పట్టించుకోదు.

పత్రికల్లోని అన్ని "వాంటెడ్ కాలమ్సు" శ్రద్ధగా చదువుతున్నాను. నాకు సరిపోయిన "వేకెన్సీ"లు ఎక్కడా కన్పించడంలేదు. అప్పుడే డాక్టరు వచ్చి అమ్మని చూసి వెళ్ళేడు. కాఫీ మానేసి హార్లిక్సు యిమ్మన్నాడు, ఏవో విటమిను మాత్రలూ టానిక్కులు కొనమని రాసియిచ్చేడు. ఎక్కడినుంచి తేవడం పైసా? ఇంటి ఖర్చుకని జిమ్మీ నాకిచ్చినదానిలో రెండురూపాయిలు మాత్రం నాదగ్గరున్నాయి. మళ్ళా పైసా అడుగుతే జిమ్మీ చికాకుపడతాడు. తనుమాత్రం ఎక్కడినుంచి తెస్తాడు? తను ఇంతమందిని భరించడం వల్లనే సిల్వియా తన్నింకా పెళ్ళిచేసుకోవడం లేదని జిమ్మీ వుద్దేశం! నిజమే. భరించలేనివాడు భార్యనెలా తెచ్చుకుంటాడు? మా బాధ ఎప్పటికైనా వొదుల్తుందా లేదా అనే సిల్వియాకూడా చూస్తూవుండొచ్చు. కాని మాకేదారీ యింకా కన్పించడంలేదు. మేరీ అంటే పోనీ చిన్నపిల్ల. నాకయినా ఈపాటికి ఏ గొప్పసంబంధమో దొరికి మా అమ్మా వాళ్ళని పోషింపగల్గితే ఎంత బాగుండును! జిమ్మీకి కొంత మనశ్శాంతి కలుగును. కాని ఎలాగవుతుంది?... వట్టి పగటి కలలు. అసలు సంబంధమంటూ ఏదీ లేనప్పుడు గొప్ప సంబంధమెక్కడినుంచివస్తుంది? పురమే లేనిదే అంతఃపుర మట!

*         *         *

పత్రిక తిరగవేస్తున్నాను. అమ్మ మెల్లిగా లేచి కూచోని చిరిగిపోయినబట్టలేవో కుట్టుకుంటోంది. మేరీ వచ్చింది వీధులోంచి. క్రిస్‌మస్ దగ్గరకొస్తూంది, తనకొక కొత్త చీర కావాలిట. లేకపోతే నలుగురిలోనూ తను తిరగలేదట!

"ఇప్పుడు కొత్త చీర ఎక్కడినుంచి వస్తుందమ్మా. జిమ్మీకూడా ఏమీ కొనుక్కోడంలేదు-చూస్తున్నావా? మన పైసా ఇబ్బంది నీకేమీ తెలిసినట్టు లేదు"అని అమ్మ విసుక్కుంది.

"నే ఎప్పుడేదికావాలన్నా పైసాలేదనే విన్పిస్తుందీ యింట్లో"అని రుసరుసలాడుతూ మేరీ నా పక్కకువచ్చి కూచోని—

"పేపర్లో 'వాంటెడ్ కాలమ్మ'లు చూడవే నోరా! 'ఆయా' ఉద్యోగానికేనా అప్లయి చేస్తాను" అంది నా చేతిలోని పత్రిక చూసి, కోపాన్నంతా వెళ్ళగక్కుతూ.

నాకు నవ్వువచ్చింది.

"దేనికి అంత చికాకు? పెద్దదాన్ని నేనుండగా నీకు ఉద్యోగం ఖర్మం ఏమిటి?... ఇంతకూ నేను రోజూ పత్రిక చూస్తూనేవున్నాను. నాకు సరిపోయిన 'వేకెన్సీ' లెక్కడా కన్పించలేదింకా."

"సరిపోవడ మేమిటి? మన మొహాలకి గవర్నరుపనులు, కలక్టరుపనులు ఖాళీ లెప్పుడు వస్తాయి! దేనికో దానికి 'అప్లయి' చెయ్యాలిగాని" మొండివాదానికి మా చెల్లెలు పెట్టిందిపేరు.

"అయితే ఇందు ఈ పత్రిక. వాంటెడ్ కాలమ్మలో దేనికోదానికి అప్లయి చేసెయ్" అని పత్రికలోని ఆ పేజీ విప్పి ఎదురుగా పెట్టేను.

"ఇగో, ఇక్కడ 'ఎయిరుఫోర్సు'కి 'కేడెట్టు'లు కావాలిట... ఇక్కడ ఎవరికో లెక్కలుమేష్టరు కావాలి... మనకి లెక్కలు పూజ్యంకద! ఇహ ఈ పక్క ఏదో బేంకుకి కేషియరు అవసరం. ధరావతు రెండువేలు చెల్లించాలి. ఈ కింద ఎవరో 'వధువు కావలెను' అన్నారు. పాపం పెళ్లికోసం కూడా ప్రకటన వేయించుకోవలసివచ్చిందెవరికో. '35 ఏళ్ళ యువకునికి సుమారు 25 ఏళ్ళ చక్కటి బ్రాహ్మణ యువతి' కావాలిట. మనం క్రిస్టియన్లమయిపోయినాము. మతం మార్చుకున్నా 'అండరేజి!' ఈ 'column'లో ఎవరో అనుభవం ఉన్న షార్ట్‌హాండ్ టైపిస్టులు ఉద్యోగం కావాలంటున్నాడు. మనమూ ఇలా వేసుకుందామంటే టైపు ఓ మోస్తరు గావచ్చుగాని మనకి షార్టుహేండు బొత్తిగా రాదాయెను. ఇంక మనదగ్గర చెప్పుకుందికి ఏమి 'క్వాలిఫికేషన్లు' వున్నాయని?" నా మాటకు మా మేరీ కందిరీగలాగ మొహంపెట్టి లేచిపోయింది.

"నాకు పండుగపండుగకీ కొత్త చీరలు మిగతా వస్తువులు ఎవడయినా కొంటానంటే వాళ్ళింట్లో అడ్డమయిన చాకిరీ చెయ్యడానికి నేను సిద్ధం" అని మేరీ విసురుగా వెళిపోయింది గదిలోంచి.

మా అమ్మ కొంచెం నవ్వి, "దాంతో ఏమిటమ్మా నోరా" అంది నావంక చూసి.

భోంచేసి రాత్రి పరున్నానేగాని పైసా గురించే అన్ని ఆలోచనలు. ఓసారి జార్జి మెరిశాడు మనస్సులో. అతనితో ఆ పార్కులు అవీ తిరుగుతున్న రోజులు ఎంత హాయిగా వుండేవి! ఎలా మారిపోయినాడో ఒక్కసారి మారిపోయినాడు. హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది. అతను, కాలేజీకి శెలవు లివ్వడంవల్ల వైజాగునుండి వచ్చే వుంటాడు. అప్రయత్నంగా టెలిఫోను ఎత్తాను. 'కనక్షను' దొరికింది.

"హల్లో" అన్నాడు. అతని గొంతుకే.

"మాట్లాడుతున్నది జార్జేనా?" అన్నాను.

"పంక్చ్యువాలిటీ అంటే అలాగుండాలి. ఇప్పుడే రామన్‌తో చెప్తున్నాను. సరిగ్గా ఎనిమిది గంటలకల్లా నువ్వు తప్పకుండా ఫోన్ చేస్తావని. కాని మన పిక్‌నిక్ ప్రోగ్రాము మాత్రం స్టాప్ అయిపోయింది శీలా! మా ఫాదరు..."

నా చేతిలోంచి రిసీవరు జారిపోయింది. తల తిరిగినట్టనిపించింది. ఈ 'శీలా' ఎవరు? రిసీవరు మళ్ళా అందుకొని, నా భావాలు గొంతుకలో కన్పించకుండా అన్నాను. "నేను నోరాని, నోరా పాత్రోని. నువ్వు శెలవుల్లో ఇంటికివచ్చేవో లేదో అని..."

"ఓ! నువ్వా నోరా? కులాసాగా వున్నావా? నాకు ప్రస్తుతము కొన్ని ముఖ్యమయిన 'ఎంగేజిమెంట్లు'న్నాయి. క్షమించు, తర్వాత యెప్పుడయినా కలుస్తానులే."

ఫోను వుంచేశాడు. నాకు వళ్లు మండిపోయింది. 'ముఖ్యమైన ఎంగేజిమెంట్లుట!' ఇప్పుడు పద్మినిని వదిలి ఎవరో శీలని పట్టినట్టుంది. నా ప్రేమని ఎంత చులకనగాచూసేడు! ఇటువంటి వాడిమీదా నే నిన్నాళ్ళయి ఆశ పెట్టుకొనివున్నాను! ఇతగాడికి తగిన బుద్ధి చెప్పాలంటే "కుక్క కాటుకి చెప్పుదెబ్బ" లాగ ఎవడినో ఒకడిని వెంటనే పెళ్ళాడి జార్జి యింటి ముందునుంచి గర్వంగా నడిచి వెళ్ళాలి. అప్పటికిగాని మా మంట చల్లారదు. అప్పటికిగాని నా అవమానానికి ప్రతీకారం కాదు. ఎంతో ఆశతో ఫోనుచేస్తే ముఖ్యమయిన ఎంగేజిమెంట్లుట. ముఖ్యమయిన ఎంగేజిమెంట్లు!

పత్రికలోని "వధువు కావలెను" అన్న ప్రకటన జ్ఞాపకానికి వచ్చింది. ఆవేశంతో కలం కాగితం తీసి రాయడం ప్రారంభించేను!

"కావలెను. కావలెను. ఇరవై ఏళ్ళ చక్కటి యువతికి సత్కులీనుడయిన—"

నా చక్కదనము నేనే చెప్పుకుంటే యేం బాగుంటుంది? మరి ఏమని రాయను?. ఉద్యోగమున్నాదనా, ఆస్తివున్నాదనా మనకి ఏమున్నాదని?...అన్నట్టు ఈ ప్రకటనమాత్రం వూరికే వేసుకుంటారా? ఎక్కడినుంచి తేను పైసా?

నిరుత్సాహంతో కలం జారవిడచి కుర్చీలో వెనక్కి చేరగిలబడ్డాను. మా మేరీ మాటలు జ్ఞాపకానికి వచ్చేయి. వెంటనే చక్కని ఆలోచన ఒకటి స్ఫురించింది. గబగబ మరో కాగితం తీసి "పాఠకుల లేఖలు" అన్న శీర్షికకు ఇలా రాయడం మొదలుపెట్టేను.

"సంపాదక మహాశయా,

నేను ఇరువదేళ్ళప్రాయముగల అవివాహిత యువతిని. ఆరోగ్యంగా వుంటాను. అందంగా కూడా వుంటానని అంతా అంటారు. మాది పేరుకెక్కిన ఆంధ్ర క్రైస్తవ కుటుంబము. మాతండ్రి కంపెనీ నౌఖరీ చేస్తూ హఠాత్తుగా చనిపోవడంవల్ల మా సంసారం చితికిపోయింది. మా నాన్న పోయిన విచారంవల్ల మా అమ్మ ఆరోగ్యం చెడి మంచమ్మీద వుంది. మేమిద్దరం అక్కచెల్లెళ్లం."

మా అక్క డోరా సంగతి ఎందుకు చెప్పాలని మానేశాను.

"ఎక్కడా ఆస్తిపాస్తులుగాని వేరేసంపాదనగాని లేక మేముచాలా ఇబ్బందులలోవున్నాము. ఏకులంవాడయినాసరే సద్వంశస్థుడైన యువకుడెవడయినా దయార్ద్రహృదయముతో ప్రస్తుతము మాకు కొంతసొమ్ము-సుమారు రెండువేలరూపాయలు-సహాయం చెయ్యడానికి సిద్ధపడితే ప్రత్యామ్నాయంగా ఆయన్ని ఎట్టి అభ్యంతరంలేకుండా వివాహమాడి నాశాయశక్తులా ఆయన్ని సంతుష్టిపెట్టగలందులకు ప్రయత్నిస్తాను.

"నాకు వంటబాగా వచ్చును. ప్రస్తుతము మాయింటి వ్యవహారాలన్నీ నాచేతిమీదుగానే నడుస్తున్నాయి. కనుక యిల్లునిర్వహించే బాధ్యత కూడా మీదవేసుకోగలను, ఆయాల అవసరం లేకుండా. ఇంటిపనులుకాక కుట్టుపని, తగు

మాత్రం సంగీతంకూడావచ్చును. 'కాన్వెంటు'లో 'కేంబ్రిడ్జి' దాకా చదువుకున్నాను. ఇంగ్లీషు తెలుగు, హిందీభాషలు క్షుణ్ణంగా వచ్చును. వివాహము ఏపద్ధతిలో జరిగినా నాకుఅంగీకారమే. ఇప్పటి నవనాగరికుల్లాగా ఏవో చిలిపికారణాలు పెట్టుకొని భర్తకు విడాకులిచ్చేరకందాన్ని కాను. స్త్రీకి జీవితాంతమూ ఒకేభర్త అన్న భావంలో పెరిగేను.

"ఇట్టివే ఉద్దేశాలుగల యువకుని - నే కోరిన ద్రవ్యసహాయము చేసి మమ్ములను కాపాడిన దయాశాలిని, మనోవాక్కాయకర్మలా నా భర్తగాస్వీకరిస్తానని దైవసాక్షిగా చెబుతున్నాను. మీ పాఠకులలో అట్టి ఉదారస్వభావులెవరయినా వుంటే మీ పత్రికాముఖంగా నా పరిచయం చేసుకోవలసినదని నాప్రార్థన.

ఇట్లు
—కన్య."

కాగితం రెండుమూడుసార్లు చదువుకున్నాను. బాగానే ఆలోచించి రాశాననిపించింది. అనుకోకుండా అక్కడక్కడ కొంతగ్రాంథికంగాకూడా నడిచిందిమరి! ఎంతచక్కారాశానో అని కొంచం గర్వంకూడా పొడసూపకపోలేదు. "శుభస్య శీఘ్రం" అని వెంటనే ఎడ్రసురాసి వీధిలోవున్న పోస్టుడొక్కులో పడేశాను.

పడుకున్నానే గాని నిద్దర పట్టడం లేదు. మర్నాడు పత్రికలో పడుతుంది. ఎంతోమంది చదువుతారు...చదివినవాళ్ళంతా నవ్వుకుంటారో ఏమిటో! ముక్కు మొహం ఎరుగనివాడిని పెళ్ళాడుతుందిట. ఏదో చెడిపోయినరకం అయి వుంటుంది అనుకోరుకద! ఆ ఆలోచనతో నా కొంచం భయంవేసింది. అరె తొందరపడ్డానే! అనిపించింది. కొంచెం వెనకాముందు ఆలోచించి పోస్టుచెయ్యవలసింది!...ఇప్పుడు పోస్టుడొక్కులో వున్న ఉత్తరం ఎలావస్తుంది? పోస్టు మనిషి ఏ తెల్లవారకట్లో తీస్తాడాయెను! అన్నా, ఎంతపని చేశాను?

* * *

మర్నాడు పత్రికరాగానే గబగబ కాగితాలు విప్పిచూసేను. ఎక్కడా నా ఉత్తరం కనిపించ లేదు. అన్నట్టు నా గాభరాయేగాని ఆనాడేకదూ వాళ్ళకి అందుతుంది. మర్నాడు తప్పకుండా పడుతుంది అని నిశ్చింతపడ్డాను...మర్నాడూ పడలేదు. ఆ మర్నాడూలేదు. సంపాదకుడు నవ్వుకొని చింపేసివుంటాడు అని నిరుత్సాహ పడ్డాను. పోనీ, ఏదొచ్చినా మన మంచికొరకే అన్నారు. తగిన ఆలోచనలేనిదే తాత్కాలికో ద్రేకంలో రాసినందుకు అది పడకపోవడమే మంచిదయింది అని మనస్సు సమాధానపరుచు కున్నాను...కాని మనస్సులో ఏదో కోణంలో మాత్రం వుత్తరం పత్రికలో పడితేనే బాగుణ్ణు అన్న ఆలోచన లేకపోలేదు!

ఆ మరుచటిరోజు జిమ్మీ నేనూ కాఫీతాగు తున్నాము. జిమ్మీ నాదగ్గరగావచ్చి, "నోరా, నువ్వెక్కడయినా ఉద్యోగప్రయత్నం చెయ్యా లమ్మా" అన్నాడు.

నా మొహం ఎర్రబడింది.

"పేపర్లు చూస్తునే వున్నాను జిమ్మీ. నా కెక్కడా సరిఅయిన వేకెన్సీలు కన్పించడంలేదు" అన్నాను తలవంచుకొని.

"పేపర్లో చూడ్డంకాదునోరా. ఆఫీసులకెళ్ళి ఆఫీసర్లని కలుసుకోవాలి. కేంబ్రిడ్జిదాకా చదివిన దానివి నీ కెక్కడయినా ఉద్యోగం దొరక్క పోదు...ఇంతమటుకు చెప్పడానికి కారణంకూడా వుందిలే."

జిమ్మీ ఓ సారి నిట్టూర్పు విడిచి మళ్ళా అన్నాడు.

"అమ్మతో చెప్పలేంకా. నా ఉద్యోగం ఈ నెలాఖరుతో సరి. రిట్రెంచిమెంటులో నన్ను తీసేస్తున్నారు."

నాకు పిడుగుపడ్డట్టే అయింది. జిమ్మీ జీతం తప్ప వేరే ఆధారంలేదుమాకు. ఆ నూటపది రూపాయలు లేకపోతే ఇహ బతకడ మెలాగ? నిశ్చేష్టురాలనై జిమ్మీవంకచూస్తూ వుండిపోయి నాను.

"బెంగపడకు నోరా. మళ్ళా ఉద్యోగం రాకపోదు. నువ్వుకూడా ప్రయత్నించడం మంచి దని చెపుతున్నాను."

ఈలోపుగా మాచెల్లి మేరీ చేతితో పత్రిక పట్టుకొని హడావుడిగా ప్రవేశించింది.

"కాలం ఎలావుందో చూశారా? ఎవర్తో

కన్యట, రెండువేలరూపాయలకి అమ్ముడుపోతానంటోంది! పాపం దానివిలువ అంతేకాబోలు!" అని పకపక నవ్వుతూ పత్రిక అందిచ్చింది. మా జిమ్మీ పత్రికపుచ్చుకొని చూస్తున్నాడు.

నాకు ముచ్చెమటలూ పోశాయి. నాముఖభావాలు వాళ్ళకి కనిపించకుండా కాఫీకప్పులు పట్టుకొని వెనక్కు తిరిగి బల్లమీద పెట్టడానికి వెళ్ళినట్టు వెళ్ళి కొంతసర్దుకొని వచ్చేను. గుండె మాత్రం వేగంగా కొట్టుకుంటోంది.

జిమ్మీ పేపరు చదివి "లోకంలో రకరకాల అమ్మాయిలున్నారు" అని నవ్వేసి పత్రిక మేరీకిచ్చి వెళ్ళిపోయినాడు. నేను కొంతతమాయించుకొని "ఏదీ నన్ను చూడనీ" అని తడబడుతున్న చేతులతో మేరీచేతులోని పత్రిక తీసుకున్నాను. నా ఉత్తరం యథాతథంగా చక్కని అచ్చులో ముందర "కాలం"లోనే వుంది. నేను రాసింది అచ్చుపడ్డం - అదోరకమయిన సంతోషము కలిగింది. నాలాగ ఎంతమంది ఆ ఉత్తరాన్ని చదువుతుంటారావేళకి!

ఉత్తరం అంతా మరోసారి చదువుకున్నాను. నామటుకు చాలా బాగానే రాశాననిపించింది. కాని పైకిమాత్రం ఏమీ అనలేదు. నేనేమీ అనకపోవడం మా మేరీకి ఆశాభంగమయింది కాబోలు తనే వ్యాఖ్యానించడం మొదలుపెట్టింది.

"దీనికేమయినా మతిపోయిందే! రోజూ చూస్తున్నవాళ్ళే పెళ్ళి విషయంలో నమ్మించి దగాచేస్తున్నారుకదా ఎప్పుడూ ఎరగని మొహాన్ని పెళ్ళాడ్దాననడమేమిటి? పైసాతో నేవుందాఅంతా? లక్షాధికారే వున్నాడనుకో, దున్నపోతులాగా వుంటాడు, ఏ రెండో పెళ్ళివాడో మూడో పెళ్ళివాడో అయివుంటాడు. ఆడదయితే చాలు నన్నరకంవాడెవడో వుంటాడు. పెళ్ళాడేస్తుందా" అని మేరీ నవ్వింది.

నేను కొంచం గతుక్కుమన్నాను. రెండో పెళ్లి, మూడో పెళ్లి విషయం నాకప్పటిదాకా తట్టనేలేదు. మా మేరీ అన్నదానిలో అర్థం లేకపోలేదు... ఏమయినా తొందపడ్డాననే అనిపించింది.

* * *

ఆనాటినుంచి వరుసగా పత్రిక జాగ్రత్తగా చూస్తున్నాను. నాలుగోనాడు నేను నిరీక్షించిన దినం వచ్చింది. ఆనాటి పత్రికలో "పాఠకుల లేఖలు" అన్న శీర్షికలో మొదటి వుత్తరం యిది:

"కన్యారత్నమా,

నీవుత్తరంలోని విషయాలన్నీ సంపూర్ణ అంగీకారముతో వ్రాసినవయితే, ఆ విషయములో యింకా మనసు మార్చుకోకుండావుంటే పోస్టు బాక్సు నెం. 4008 రు. ద్వారా నీ 'వరుని'తో సంప్రదించవచ్చును."

రెండుసార్లు చదువుకున్నాను. అది నా వుత్తరానికి జవాబే. సందేహంలేదు... నా వరుడు! ఎవరతను? ఎటువంటివాడో? వెంకి రకం కాదు కద! ఇప్పుడేం చెయ్యడం? పత్రికలో రాయడమంటే రాసేశానుగాని తర్వాత సంగతి ఏమీ ఆలోచించలేదు... ఓపక్క జిమ్మీ వుద్యోగం ఊడిపోతున్నదీ నెలాఖరున... ఇతను రెండో పెళ్ళివాడయివుంటాడా? ఏమో, ఇతను నేను మనసులో చిత్రించుకున్న యువకుడయి నే కోరినట్టు పైసాసహాయం చెయ్యకూడదూ?...సంప్రదింపులన్నీ అయిన తర్వాతకదా ఖాయంగామాట ఇవ్వడం! ఇష్టంలేకపోతే అప్పుడే మానెయ్యవచ్చు. ఈ వుత్తరానికిప్పుడు జవాబురాస్తేమించిపోయిందేమిటి?

ఎలాగయితేనేమి చివరకి ఒకజవాబు తయారు చేశాను. మళ్ళామళ్ళా చదువుకున్నాను ఎక్కడా పొరపాట్లు లేకుండా.

"అయ్యా!

ఇవాళ పత్రికలో అయిదవ పేజీలోని మీ జవాబు చదివి ఆనందించేను. మీ యింటి ఎడ్రసు యిస్తే ముఖతా మీతో కొన్ని విషయాలు ముందుగా మాటాడవలసివుంది. అన్ని విషయాలు తెలుసుకొన్న తర్వాత యిరువురకూ అంగీకారం అయితేనే మిగతాసంప్రదింపులని మీరు గ్రహిస్తారనుకుంటాను.

ఇట్లు
విధేయురాలు
ఎస్. ఏ. పి.,
కేరాఫ్ పోస్టుమాస్టర్."

సాయంత్రం పోస్టులో పడేశాను. రెండు రోజుల తర్వాత పోస్టాఫీసుకి వెళ్లి కనుక్కుంటే

నే ననుకున్నట్లుగానే నాకో వుత్తరం వచ్చింది. విప్పి చదువుతున్నాను.

"ప్రియమైన ఎన్. ఏ. పీ.!

సిటీ హోటల్‌లో 19వ నెంబరు గదిలో ప్రస్తుతం నా మకాం. ఏనాడయినా సాయంత్రం ఆరు గంటలకి వచ్చి నన్ను కలుసుకోనవచ్చును.

'ఇద్దరూ అంగీకారం అయితే నే' అని హెచ్చరించడం మీ ముందు జాగ్రత్తను తెలియజేస్తోంది. ఆ సుగుణం నా సహధర్మచారిణికి వుండదగినదే.

ఇట్లు
జాన్."

జాన్, జాన్, రెండు మూడుసార్లు ఉచ్చరించేనా పేరు. ఈ 'జానా' నా కాబోయే భర్త! మా సంసారం సుఖంగా వెళ్తుందీ? ఎలా వుంటాడుచెప్మా? కొంపదీసి ముసిలాడూ, మూడో పెళ్లివాడూ కాదుగద! ... నా జీవితం నవ్వులు పాలు కాదుకద!... ఏమిటేమిటో ఆలోచనలు తిరిగిపోతున్నాయి బుర్రలో.

* * *

మర్నాడు పొద్దున్న మా అమ్మకి హార్లిక్సు కలిపి యిస్తున్నాను.

"ఏమమ్మా, రాత్రి నిద్దర లేనట్లుందే?" అంది మా అమ్మ.

"దోమలబాధనుంచి సరీగా నిద్దరలేదమ్మా" అనేశాను.

"నీజీతం దొరికింతర్వాత నోరా కోసం ఓ దోమతెర కొనరా అబ్బాయి" అంది మా అమ్మ అన్నయ్య జిమ్మీ వంక చూసి.

జిమ్మీ నిర్జీవంగా నావైపు చూసేడు. పాపం మా అమ్మకింకా తెలీదు. ఈలోగా మా చెల్లి మేరీ గబగబావచ్చి, "చూడు జిమ్మీ శైలబాల మాటిమాటికీ 'పాపం మీ అన్నయ్య ఉద్యోగం పోయిందటగా?' అంటోంది అందరి ముందరాను. వాళ్ళ అన్నయ్య చెప్పేట్ట. వెధవ అబద్ధాలు ఆడేను. వాళ్ళన్నయ్యకి పెద్దపని అనీ మనం కొంచం బీదగా వున్నామనీ కాబోలు ఆ రాలు పాటు!"

నేనూ, జిమ్మీ ఒకరినొకరం చూసుకున్నాం. మా అమ్మ మాయిద్దరి వాలకం కనిపెట్టినట్టుంది-

"నిజమేనా ఏమిట్రా, అబ్బాయీ?" అంది కొంచెం బెంగతో.

అన్నయ్య చెప్పక తప్పింది కాదు.

"అవునమ్మా, ఈ నెలాఖరుతో నాపని పోతున్నది" అన్నాడు.

"ఆఁ! నిజమే?" అని నిలబడిపోయింది మేరీ.

మా అమ్మ ఒక్కసారి కళ్ళు మూసుకుంది.

"అయితే మనకెలాగ?" అంది మేరీ అందరి మొహాలూ చూస్తూ.

మునిగిపోతూవున్న పడవలో వున్న మనుష్యుల్లా ఒకళ్ళనొకళ్ళం నిరుత్సాహంగా, నిశ్శబ్దంగా చూసుకున్నాము.

* * *

సాయంత్రం అయిదున్నర అయింది. డ్రెస్సు వేసుకొని ట్రామెక్కి "ఎస్ప్లనేడు" వెళ్ళేను. ట్రాములైనుకి వందగజాల దూరంలోనే వుంది "సిటీ హోటేలు". మెల్లగా లోనికి వెళ్ళి 19వ నెంబరు గది ఎక్కడుందని మేనేజరు నడిగాను. పై అంతస్థులో మెట్లు ఎక్కగానే ఎదురుగావున్నదే అన్నాడతను. అడుగులుతడబడుతూ మెట్లు ఎక్కేను. మీద ఎదురుగానున్న గదిమీద 19 అని రాసివుంది. తలుపు ఎలా తట్టడమా అని ఆలోచిస్తూ వుండగా గదితలుపు తెరుచుకొని ఒక వ్యక్తి బయటకు వచ్చేడు. వేషం ఉచ్చారణబట్టి తమిళుడని గ్రహించాను.

"అన్నివిషయాలూ పరిశీలించి మీకు రాస్తాను. సెలవు" అని వెనుకనున్న మరో వ్యక్తితో పలికి, పక్కనున్న నన్నోసారి తేరి పారచూసి మెట్లు దిగి వెళ్ళిపోయాడతను. వెనుకనున్న ఆసామీకి పెద్ద గడ్డాలూ మీసాలూ కళ్ళకి నల్లద్దాలూ వున్నాయి. మెట్లదాకా వచ్చి అతనిని సాగనంపి, "సెలవు" అని వెనుతిరిగిపోతూ, పక్కనే నిలబడి వున్న నన్ను చూసి ఆగిపోయాడు.

నాకు నాలుక పిడచ కట్టుకోపోయింది. అతనోసారి చేతిగడియారము చూసుకొని,

"తమరు జాన్‌కోసం కదూ చూస్తున్నారు?" అన్నాడు. అవునని తల వూపేను.

"ఇలా లోపలికి దయచేయండి" అని గది లోనికి దారి తీసేడు.

అతనివెంట వెళ్ళి అతనుచూపిన ఆసనములో

కూర్చున్నాను. అతను గంటవాయించి హొటేలు కుర్రవానిని పిలచి కొన్ని కేకులు, స్వీట్సు, టీకి ఆర్డరిచ్చి టేబిలు కావలిపక్క నా కెదురుగా కూర్చున్నాడు.

"నేనే జాన్‌ని, జాన్ మైకేల్ పాల్ నా పూర్తి పేరు. మీ పూర్తి పేరు తెలుసుకోవచ్చునా?"

"నోరా ఎడిలైన్ పాత్రో."

అతనోసారి తల పంకించి హొటేలు కుర్రాడు తెచ్చిన ఫలహారాలను కొన్నింటిని నా ముందుకు తోసేడు. ఆ గడ్డాలవల్లా, ఆ నల్లద్దాలవల్ల అతని వయసెంతో సరిగా తెలియకపోయినా ముప్ఫయి అయిదు పై బడ్డట్టే వుంది మొహం. పదిహేను ఏళ్ళ భేదం!...చివరకి ఈ గడ్డాలమనిషా నాకు రాసివున్నాడు?...ఆయన్ని భర్తగా స్వీకరించడమంటే ఆదేమిటోలాగుంది. అయినా మాటల్లో అమర్యాదా కనిపించకూడదుగా.

"ఇన్ని స్వీట్సు నే తినలేనండి. ఈ రెండు చాలు" ఫలహారం కానిస్తూ అతను మాట్లాడుతున్నాడు. మధ్యమధ్య నన్ను నిదానించి చూస్తున్నాడు. చూపులు కలిసినప్పుడు ఫలహారాలమీదకి దృష్టి మళ్ళిస్తున్నాడు. కొంచెమించు నా అవస్థా అలాగే వుంది. అమర్యాదా వ్యక్తంకాకుండా అతని హావభావ విలాసాలను పరీక్షించాలి. అతనితో నా జీవితం ముడివేసుకోవడం భావ్యమో కాదో స్థిరపరచుకోవాలి.

"ముందు మీ ఉత్తరం చదివిన తర్వాత నేనూహించిన మనిషికీ మీకూ చాలా తేడావుంది" అని అతడు కొంచం నవ్వేడు.

నా ఊహాలూ అంతే అయేయి అని నేను మనసులో అనుకొని వూరుకున్నాను.

నే నేమయినా జవాబు చెపుతానేమో అని అతను కొంచం ఆగినట్టుంది.

"నాకు ఆడవాళ్లతో మాట్లాడ్డం సరిగ్గారాదు లెండి. అనుసరించవలసిన మర్యాదా లేమిటో కూడా సరిగ్గా తెలీదు. ఏమయినా అమర్యాదాగా మాట్లాడినట్టనిపిస్తే మీరు క్షమించాలి. ఎప్పుడూ శాస్త్రచర్చలో మునిగినవాళ్లకి మీబోటి నాగరికస్త్రీల పరిచయభాగ్యం కలిగే అవకాశాలు తక్కువ. అసలు నాకు ఇంతవరకు ఏ అమ్మాయితోనూ పరిచయంలేదనే చెప్పాలి. చిన్నప్పుడు మా అమ్మ..."

అతను కొంచెం ఆగేడు.

"నా చిన్నప్పుడే పోయింది లెండి. మా తండ్రి ఆ తర్వాత రెండో వివాహం చేసుకున్నాడు. కాని సంతానంలేదు. అతడూ రెండేళ్ల క్రితం చనిపోయాడు. నా సవతితల్లి ప్రస్తుతం వాళ్ళ అన్నగారిదగ్గర కాబోలు వుంటోంది. ఆ అన్నగారికో అమ్మాయివుంది లెండి. ఎలిజబెత్ అని. అదిగో, ఆ అమ్మాయితో ఒకటి రెండుసార్లు మాట్లాడివుంటా నంతే... ఈ సొదకేంగాని ఇహ మన విషయం మాట్లాడుకుందాం...మీరు రాసిన విషయాలు సంపూర్ణ అంగీకారముతో రాసినవే కదూ?"

నేను కొంచం కళవరపడ్డాను.

"అంటే...మా స్థితి చాలా...ఏదో ఆలోచన లేనిదే రాసీశాను. ఫలితాలు ఏరకంగావుంటాయో వూహించుకుందుకి వయస్సు తక్కువవడం..."

"ఎంత మీ వయస్సు?"

"ఇరవై"

"ఇహ నేమి? మైనారిటీ తీరిందన్న మాట... అయితే వూరికే సరదాకి రాశారన్న మాట"

"కాదు. రాసినప్పుడు మాత్రం సరదాకని రాయలేదు. చాలా ఇబ్బందులలో వుండి మనస్ఫూర్తిగానే రాశాను...కాని ఇప్పుడాలోచిస్తే ముఖపరిచయం లేనివారిని ఇలా హఠాత్తుగా పెళ్ళి చేసుకోవడం అంత సమంజసం కాదేమో అనిపిస్తుంది."

అతను కొంతసేపు నావంక చూస్తూ వూరుకున్నాడు.

"మీరు చాలా ఇబ్బందులలో వున్నారనుకుంటాను."

"చాలా చాలా ఇబ్బందులలోనే వున్నాము. మా అన్నయ్యకి ఈ వెలాఖరుతో ఉద్యోగం సరి. నాకు ఎంత ప్రయత్నించినా ఇంకా ఎక్కడా ఉద్యోగం కలిసిరాలేదు."

"మీకో అన్నయ్య వున్నాడా?"

"ఉన్నాడు. మా జేమ్సు విషయము నేను వుత్తరంలో రాయలేదు. మాకో అక్కయ్యకూడా వుంది డోరా అని. ఆమె మా అమ్మకి తెలీ

కుండా ఒకాయనతో లేచిపోయి రహస్యంగా పెళ్ళి చేసుకుంది. అప్పటినుంచి వారికీ మాకూ రాకపోకలులేవు. ఇలా ఎవరి ఆసరా లేక."

ఆగేను. ఇవన్నీ ఇతనితో చెప్పడమెందుకింక? వేగం క్షమాపణ చెప్పుకొని తిరిగిపోవడమంచిది.

అతను కొంచెం ఆగి ప్రశ్నించేడు.

"మీవుత్తరం విషయం మీఅమ్మకి తెలుసా?"

"తెలీదు. నే నెవ్వరితోనూ చెప్పలేదు, చిన్నతనం కొద్దీ ఏదో రాసేశాను. మా అక్కయ్య మాదిరి నేకూడా మా అమ్మ నడగండే వివాహం చేసుకుంటే మా అమ్మ ఆ నీరసంలో—ఏమైనా అవవచ్చు. పరిచయమే లేని మీతో వివాహానికి మా అమ్మ ఎప్పటికీ వప్పుకోదు. అదీగాక, వివాహం జీవితాంతం వరకు వుండే బంధం. తగినంత ఆలోచన లేనిదే తొందర పడితే చివరకి సంతాపకరం కావచ్చు."

అతను కుర్చీలో చేరగిలబడి ఆలోచిస్తున్నాడు.

"మీరిలా మనసు మార్చుకుంటారనుకోలేదు. మాటమీద నిలబడతారనుకొని చాలా ప్రోగ్రాములు వేసేశాను... ప్రొఫెసరు మా నన్నుకూడా వెంట రానిచ్చివుంటే కొంత సరదాగా వుండేవి. హఠాత్తుగా వచ్చిన ఈ కళ్ళ యిబ్బందినుంచి మా పార్టీవారితో నేను వెళ్ళడానికి అవదు... మీరు మాగారి పేరు విన్నారనుకుంటాను."

"లేదు."

"వినలేదూ? 'డీప్ సీ ఫిషింగ్' గురించి పరిశోధనలు చెయ్యడానికని గవర్నమెంటువారు ఆయన్ను రప్పించారు. ఆయనా నేనూ ఆ విషయమై పరిశోధనలు సాగిస్తున్నాము. హిందూ మహాసముద్రము నాలుగు పక్కలా గాలించి సమగ్రమయిన ఒక రిపోర్టు తయారుచెయ్యడానికి ప్రయత్నిస్తున్నాము. ప్రస్తుతం ఆస్ట్రేలియా దాకా పెట్టుకున్నాం ప్రయాణం. నాకు హఠాత్తుగా కళ్ళజబ్బు చెయ్యడం నుంచి నేనాగిపోవ పోవలసివస్తుంది... ఈ ఆరునెలలూ మా యింట్లో కూచొని చేపల ప్రకృతిని గురించి నే చేసిన రిసెర్చిలన్నీ ఒక పుస్తక రూపంలో వ్రాద్దామనుకుంటున్నాను."

"ఎక్కడ మీ యిల్లు?" ఏదో ఒకటి అడగాలిగా!

"కాశీబుగ్గ అనే గ్రామంలో మాకో పెద్ద యిల్లు తోటా వున్నాయి. చాలానాళ్ళయి అక్కడ ఎవ్వరూ వుండకపోవడంనుంచి యిల్లు కొంచం శిథిలావస్థలో వుంది. మరామ్మత్తులు చేయిద్దామంటే ఎప్పటికప్పుడు అవడంలేదు. నా రిసెర్చి గొడవలో ఆ విషయం ఆలోచించడానికే తీరిక లేకపోయింది. ఇటువంటివన్నీ "ఇల్లాలు" అన్నది వుంటే ఆమె చూసుకోవలసినవిషయాలు చూడండి!"

అతను కొంచం ఆగి మళ్ళా మొదలుపెట్టేడు.

"ఆస్ట్రేలియా ప్రయాణం ఆగిపోవడంనుంచి ఏమీ తోచక ఆలోచిస్తున్నప్పుడు మీ ప్రకటన చూసేను. నాకు దేముడు కొంత పైసా ఇచ్చేడు. మీకు కోరిన సహాయం చెయ్యగలనని తోచింది. జీవితములో "సహచారిణి"యొక్క అవసరము మీ ఉత్తరము చూచిన తర్వాతనే నాకు స్ఫురించింది! మీరు ముందుగా వెళ్ళి కాశీబుగ్గ ఇంటిని కొంచెం మరమ్మత్తులు చేయించి, ఆ తోటా అదీ—అన్నట్టు మీరు మనసు మార్చుకున్నారు గనక అదంతా ఇప్పుడు అప్రస్తుతం అనుకుంటాను."

అతను కొంచం నిరుత్సాహంగా కుర్చీలో వెనక్కి చేరగిలబడ్డాడు. కొంతసేపు నిశ్శబ్దము. నేనేదో అనాలి! కాని ఏమిటనేది?

"వివాహం చేసుకోవాలంటే మీకు అమ్మాయిలే దొరక్కపోతారా?" నవ్వుతూ అన్నాను.

"అమ్మాయిలయితే సిద్ధంగా వుండవచ్చు. అబ్బాయికి నచ్చాలిగా?" అతనూ కొంచం నవ్వేడు.

అయితే నే నతనికి బాగా నచ్చివుంటాను కాబోలు. ఎందుకు నచ్చివుండను? ఏమిటి తక్కువయిందని? కాని నాకే అతను! ఆ గడ్డాలు తీసేమంటే? అప్పుడయినా మొహం కొంచెం తేటపడుతుందేమో, ఎందుకీ అనవసర కాలయాపన. ఇంటిమొహం పట్టడం ఉత్తమం.

"నా చిలిపితనాన్ని మీరు క్షమించాలి. మన వివాహం జరిగేందుకు అవకాశం లేదు. ఇంతకూ ముందు కొంత ప్రేమ తతంగము లేనిదే పెళ్ళిచేసుకోవడం మన క్రిస్టియను సంప్రదాయాలకి విరుద్ధమని మీకు తెలిసేవుంటుంది."

"ఏ తతంగానికయినా నా అభ్యంతరంలేదు" అని అతను పక్కున నవ్వేడు.

నేనన్న దేమిటి? అతను అర్థం చేసుకున్న దేమిటి? అతను మరోసారి నవ్వేడు.

"ప్రేమ! ఈ ప్రేమ అంటే ఏమిటో ఇప్పటి కింకా నాకు సరిగ్గా అర్థంకాలేదంటే నమ్మండి. ప్రేమ వివాహాలు అని చెప్పబడేవాటిని చాలా చూశాను. పెళ్ళికాగానే ఆ ప్రేమ అన్నదల్లా రెక్కలువచ్చి ఎటో ఎగిరిపోవడమూ గమనించేను. నా ఉద్దేశంలో పెళ్లి అంటే ఒక కంట్రాక్టు. అంటే మీరా ఉత్తరములో రాసినట్టే అన్నమాట. నేను మీకు ధనసహాయంచెయ్యడం, మీ పోషణ భారం వహించడం, మీరు నా ఇల్లాలుగా నా యిల్లూ వ్యవహారం చక్కబెట్టడం. ఇందులో "ప్రేమ"అన్నది లేనందువల్ల వచ్చిన ఇబ్బంది ఏమిటో చెప్పండి."

"మీకు ప్రేమ అంటే ఏమిటో తెలీదంటే ఆశ్చర్యంగానే వుంది."

"మీరు అవకాశం యిస్తే నేర్చుకుందామనే వుంది." చిన్ననవ్వు.

నేను లేచి నిలబడ్డాను. అతనూ లేచి నిలబడ్డాడు.

"మిస్ పాత్రో, మనపరిచయం ఇంతవేగంగా తుంచివేయడం భావ్యంగా కన్పించడంలేదు. నేను ఇంకా రెండువారాలపాటు వుంటానీ పట్నంలో. ఇవాళ డిసెంబరు 16, మంగళవారం. ఓ వారం రోజులపాటు మీరు రోజూ సాయంత్రం ఈ పాటివేళకు ఈ హోటలుకివచ్చి నాతో ఫలహారం చెయ్యడానికి అంగీకరిస్తే సంతోషిస్తాను. ఈ వారంలోపున ఒకరినొకరం బాగా అర్థంచేసుకుందికి వీలవుతుంది. ఆ తర్వాత మన యిష్టాయిష్టాల బట్టి వుంటుంది...మీ రెలాగా వుద్యోగంకోసం ప్రయత్నిస్తున్నానన్నారు. ఇక్కడ నాకు తెలిసిన ఆఫీసర్లు కొంతమంది వున్నారు. ఎక్కడయినా ఉద్యోగాలు ఖాళీలున్నాయేమో కనుక్కుంటాను. ఇంక సెలవు. నమస్తే."

"థేంక్స్. నమస్తే."

బుర్రనిండా ఆలోచనలతో మెట్లు దిగివచ్చేశాను....మాటతప్పిపోయినాను నిజమే. కాని చూస్తూచూస్తూ ఈ గడ్డాలబూచిని ఎలా పెళ్ళాడేది?

(ఇంకావుంది)

స్కెచ్

# 'సామాన్యమానవుడు'

ఎమ్. రామనాథ్

"సామాన్యమానవుని భుజస్కంధాలపై సమస్తభారం
పడుతుంది."

—అన్న ఆధునికకవి గేయం చదివిన తర్వాత నిత్యమూ వినే రాజకీయనాయకుల ఉపన్యాసాల్లోనూ; చదివే కథల్లోనూ, గేయాల్లోనూ సర్వాంతర్యామిగా వ్యాపించిన యీ "సామాన్య మానవుడు" ఎవరు? ఎలా వుంటాడు? ఎక్కడ వుంటాడు? అన్న సందేహాలు నన్ను వేధించ సాగాయి.

లోకంలో ప్రతికొత్తవస్తువూ నన్నుఆకర్షించి తన లోతులు తెలుసుకోమన్నట్లు నా కగుపించటంతో ... ప్రతి చిన్న విషయమూ ఓ సమస్యగా మారి—సమాధానం పొందేవరకూవిశ్రాంతి పొందేవాణ్ణి కాదు. అందుకనే నాన్న అంటుండేవారు "వెధవా! నీకన్నీ సందేహాలే!" అని. అవునుమరి "సూర్యుడు తూర్పునే ఎందుకు ఉదయిస్తాడు? భూమి గుండ్రంగానే ఎందుకుంది?" అలాంటి మింగుడు పడని ప్రశ్నలను ఎదుర్కోవలసి వచ్చేసరికి ఎవరుమాత్రంఏమంటారు? ఇలా కొరకరాని ప్రశ్నలనే కాక మరో దీర్ఘసమస్యనే ఆయన ఎదుర్కోవలసివచ్చింది. అది నాఉద్యోగమూ, భవిష్యత్తులతో ముడిపడి వుండటంతో నాకుగా నేనే ఒక సమస్యగా తయారై ఆయన ఎదుట కూర్చున్నాను.

ఎలాయినా యీనాడు ఉదయించిన సరికొత్త సందేహానికి సమాధానం పొందాలి. ఎవరినుండి?